


క్రమచీకటి వేళ —

వంటగది గుమ్మంలో కూర్చుని వంకాయలు తరుగుతున్నాను. సరిగ్గా అప్పుడే నాన్న లోపలికి వచ్చేరు.

వస్తూనే "అమ్మేదమ్మా?" అన్నారు.

"పడుకుంది. టీ తాగుతావా నాన్నా?" అన్నాను కత్తిపీట దగ్గరనుంచి లేస్తూ.

"ఈ వేళప్పుడు పడుకోవటమేమిటమ్మా? వంట్లో బాగుండలేదా?" అంటూ నా జవాబు ఆశించకుండానే అమ్మ వున్న గదిలోకి నడిచేరు.

తర్వాత ఏం జరుగుతుందో నాకు తెలుసు.

నెమ్మదిగా చల్లారుస్తూ నేను తాగకుండా అట్టిపెట్టిన ఎర్రటి మురికినీళ్ళలా వున్న టీనీళ్ళని వెచ్చబెడుతూ కూర్చున్నాను.

ఈ సిటీలో మాలాంటి వాళ్ళకి అంతకుమించి మంచి టీ ఎలా దొరుకుతుంది? పక్కింటి సావిత్రి పిన్ని అమృతంలాంటి కాఫీయిస్తుంది వాళ్ళింటి కెళ్తే. ఇంటిదగ్గర గేదెని తెప్పించి పిండిస్తారు. లీటరు నాలుగురూపాయిలట.

అలాంటి పాలు కొనాలంటే మావల్లి కాకపోదు. మా నాన్న పి.డబ్ల్యూ.డి.లో సూపరెంటు! పక్కింటి పరమేశం బాబాయి కూడా సూపరెంటే! మాది పెద్ద సంసారం కూడ కాదు. కాని మా పరిస్థితులే హీనమైనవి. దానికి కారణం ఏదని చెప్పగలను!

టీ గ్లాసులో పోసి తీసికెళ్ళేను.

అమ్మ ఏడుస్తూ కన్నీళ్ళతో మాట్లాడుతోంది "వాడిని అచ్చోసిన ఆంబోతులా మేపి మా మీదకి వదిలేరు. మీకేం, మీరు ఆఫీసు కెళ్ళిపోతారు. వాడెన్ని మాటలు అంటున్నాడో మీకేం తెలుసు! శక్తికి మించిందని చెప్పినా వినకుండా మమ్మల్నందర్నీ ఒరగబెడతాడని వున్నదంతా వూడ్చి దానే వన్నుకట్టి యింజనీరింగ్ చదివించేరు. వాడిప్పుడు వుద్యోగం లేదని — దానికి మనమే బాధ్యులమన్నట్లు సూటిపోటి మాటలు నాలుగేళ్ళ నాస్టల్లో వెలగబెట్టాడో లేదో — పుట్టినప్పటినుండీ వున్న యిల్లు — పరిస్థితులు మరచిపోయేడు. ఏ కూరచేసినా వెధవకూరంటాడు. టీ చూసి

'ఛీ' అంటూ పారబోస్తాడు. దరిద్రపు కొంపంటూ సతాయిస్తాడు. ఉద్యోగం యిప్పించలేదని నానా మాటలంటాడు."

నాన్నగారు చొక్కా తీసి వంకెకు తగిలించి "పోనీలేవే, ఇంత చదువూ చదివి వుద్యోగం లేకుండా యింటిపట్టు నుండాల్సి వచ్చిందని అలా విసుక్కుంటాడు. వాడు ఏదో అన్నాడని మనం కూడ తొందరపడితే ఎలా?" అన్నారు శాంతంగా.

"అవును. మీకు సంతోషంగానే వుంటుంది. అవతల వాడికన్నా రెండేళ్ళ పెద్దది- అక్కగారనే మర్యాద కూడ లేకుండా టీ బాగా పెట్టలేదని దాన్ని ఎన్ని మాటలన్నాడు? ఇంట్లో కూర్చుని టీ పెట్టడం కూడ నేర్చుకోలేదట! అదేం చేస్తుంది? పిండి కొద్దీ రొట్టె. మనం కొనే నీళ్ళపాలకి ఎన్నిసార్లు మంచి టీ పెట్టివ్వగలదు?"

గుండెలమీదుగా చిరిగిన చీర సర్దుకుని నాన్నకి టీ అందించేను. అమ్మ నావంక చూసింది. ఆ వెంటనే ఆవిడ కళ్ళలో నీళ్ళు తిరిగేయి "దానికి ఒక్క సరయిన చీర ఉందా? దానికో అక్షరం ముక్క నేర్పించేరా? దాని పెళ్ళిసంగతి మీ కేనాడయినా పట్టిందా? చేయటానికి సూపర్నెంటు వెలగబెడుతున్నారు. కోటీ వాళ్ళంతా ఎలా కళకళలాడిపోతున్నారు! మనదేమంత ఈదర్చలేని సంసారం! ఒక్క ఆడపిల్ల - ఒక్క మగవాడు! పెళ్ళయిన పదిహేనేళ్ళ వరకు 'మా వాళ్ళు మావాళ్ళంటూ మీ చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు-పురుళ్ళు, తమ్ముళ్ళ చదువులు - వుద్యోగాలు' అంటూ సరిపుచ్చేరు. ఏదో మా పుట్టింటివాళ్ళ దయతో నేను వంటినిండా గుడ్డ చుట్టుకోగల్గేను. వాళ్ళ సమస్య తీరిందనుకునే సరికి తలకి మించిన అప్పులుచేసి కొడుకుని యింజనీరింగ్ వెలగబెట్టించేరు. ఎదురుగా ఎదిగిన ఆడపిల్లని చూసి మీకు చీమకుట్టినట్లయినా లేదు."

అమ్మ నిలువెల్లా ఆవేశపడిపోతోంది.

"చూడు రాజ్యం, ఈ రోజున కొత్తగా వచ్చిన సమస్యేమయినా వుందా? వాడు ఖాళీగా వుంటున్నాడని అలా పిచ్చెత్తినట్లు ప్రవర్తిస్తున్నాడు. చదివిన చదువుకి సరయిన వుద్యోగం రాలేదని వాడికి దుఃఖం! ఇంత చదువూ చదివి నిరుద్యోగిగా తిరగాలంటే వాడికి నామోషీ కాదూ! ఏదైనా అవసరానికి డబ్బు కావాలంటే చెట్టంతయి తండ్రి దగ్గర చెయ్యి చాచాలంటే వాడికి బాధ! వాడికి మాత్రం 'అమ్మా - అక్కా' అనే ప్రేమ వుండదూ! కన్నతల్లివి నువ్వే వాణ్ని అర్థంచేసుకోకపోతే యెలా?"

నాన్న చల్లగా మాట్లాడి హాల్లోకి వచ్చేరు.

అమ్మ నిస్పృహగా ముఖం తిప్పుకొంది.

ఆవిడకి కొద్దిగా గుండెనొప్పి వుంది.

ఆవేశపడితే ఏమవుతుందోనని నాకు భయమూ, బాధ.

"అమ్మా, ఏం మూకంతగా బాధపడ్తావు? తమ్ముడి గుణం ముందునుండి నీకు తెలిసిందే కదా! ఈరోజే ఏదో జరిగినట్లుందుకలా కుమిలిపోతావు!" అన్నాను అనునయంగా.

ఆవిడ నావేపు జాలిగా చూసింది. ఆ కళ్ళనిండా కట్టలు తెంచుకోటానికి సిద్ధంగా వున్న నీళ్ళు!

"అవును! వాడి గుణం నాకు తెలియక పరాయివాళ్ళకెలా తెలుస్తుంది? చిన్నప్పుడు వాడిచివాడి కుండా నీ చేతిలో ఆటవస్తువుకోసం ఏడ్చేవాడు! వాడిపోరు భరించలేకనో- వంశోద్ధారకుడనే ప్రేమచేతనో 'పెద్దదానివి' అంటూ నీ చేతిలోది లాక్కొని వాడచేతిలో పెట్టి పూరుకోబెట్టేవాళ్ళం! చివరికి చిన్ననాడు ముద్దుగా ధరించిన హారం కూడా వాణ్ణి పుత్ర స్వార్థపరుణ్ణి చేసింది. ఈరోజు వాడు వాడి గురించి తప్ప పక్కవాళ్ళ గురించి ఆలోచించే స్థితి దాటిపోయేడు. వాడనలా తయారుచేసింది మేమే తల్లీ మేమే!" అంది ఆవేదనగా.

నాకేం మాట్లాడాలో తోచలేదు

నేను పెద్దగా చదువుకోలేదు అసలంటి అవకాశం నాకు రాలేదు.

థర్డ్‌ఫారమ్ చదువుతుండగా అనుకుంటాను, అమ్మకి బాగా జబ్బుచేసింది ఇంట్లో సాయానికి మరో ఆడకోడు లేకపోవటంతో నా చదువు అర్థాంతరంగా ఆగిపోయింది. అసలు నా చదువు ఆగిపోవటమనేది అప్పట్లో ఎవరికి పెద్ద సమస్యగా కన్పించలేదు. ఆ రోజునుండి-ఇంటిపని వంటపని నా వ్యాపకమైపోయింది

పక్కింటి పరమేశం బాబాయి మాత్రం నాన్నను చాలసార్లు కోప్పడటం నాకు తెలుసు.

"పార్వతిని అనవసరంగా చదువు మానిపించేవ్! ఈ రోజుల్లో చదువులేని ఆడపిల్లలున్నారా! ఇప్పుడయినా మించిపోయింది లేదు. కనీసం మెట్రిక్ అయినా కట్టించు" అని.

నాన్న ఆ మాటల్ని అంత లక్ష్యపెట్టలేదు.

అప్పట్లో నాకు నా జీవితంమీద యిదమిత్థమైన అభిప్రాయమంటూ లేదు. అందువల్ల 'నేను చదువుకుంటాను నాన్నా' అని నోరువిప్పి ఏనాడూ అడగలేకపోయేను.

ఇప్పుడిప్పుడే నా మెదడు కొత్త ఆలోచించగల్గుతోంది.

తోటి ఆడపిల్లల్లా కాలేజీలకి వెళ్ళలేకపోయేనన్న ఆవేదన నాకు ఏనాడూ లేదు. విజ్ఞాన సముపార్జనకోసం డిగ్రీలు పొందలేదన్న బాధకూడ లేదు.

నాన్న వయసులో పెద్దదాన్నయిన నా పెళ్ళి వెనక్కి నెట్టి వున్నదీ లేనిది తెచ్చి శక్తికి మించి తమ్ముడికి 'పెద్ద



చదువు చెప్పించేమ. తమ్ముడు పెద్దచదువు చదువుకున్నాడన్న దుగ్ద కూడ నాకు లేదు. నా తోబుట్టువు పెద్ద వుద్యోగంలో వుంటే నాకూ ఆనందమే కదా!

ప్రస్తుతం నన్ను పీడిస్తోన్న బాధ ఒక్కటే!

నా జీవితానికి గమ్యం ఏమిటి?

నాన్న ఆలోచనలు వేరు! ఆయన ఇంజనీరింగ్ డిపార్టుమెంటులో పని చేస్తున్నారు. తోటి ఇంజనీర్లు ఎలా అంచెలంచెలుగా ప్రమోషన్లు పొంది ఆఫీసుకి అధికారు లయిపోతున్నారో ఆయన కళ్ళారా చూసేరు.

"ఓపే మొద్దూ! కష్టపడి బి.ఏ.లు, ఎమ్.ఏ.లు చెప్పిస్తే వాడికి మహా వస్తే గుమాస్తాగిరి వస్తుంది. దానితో వాడు పాతికేళ్ళు నౌకిరీ చేసి చివరకెప్పుడో మహా అయితే సూపర్నెంటు అవుతాడు. మళ్ళీ చాలీచాలని బ్రతుకులే. మా నాన్న గుమాస్తా నేను గుమాస్తా, మళ్ళీ నా కొడుకు కూడ గుమాస్తాయే కావాలా? అందుకే వాణ్ణి కష్టపడి చదివించి ఇంజనీరు చేయాలనుకుంటున్నాను. వాడు అందివస్తే మన కష్టాలన్నీ యిట్టే గట్టెక్కుతాయి" అనేవాడు అమ్మతో.

కాని నాన్న అంచనాలు తారుమారయ్యాయి.

ఆయన పథకాలు బెడిసికొట్టేయి.

ఇంజనీర్లకి పెద్దపెట్టున పోస్టింగ్సు వచ్చేయట! ఉన్నవాళ్ళనే ఊడబీకేసే

రట। దానితో మా తమ్ముడు నారాయణ నిరుద్యోగిగా మిగిలిపోయేడు.

మనే ఉన్న ఉద్యోగం చెయ్యాలన్నా వాడికి రావ్వలేని నామోషి।

ఇవతల చదువుకోసం నాన్న చేసిన అప్పులు వడ్డీలతో కలిసి మేరుపర్వతంలా పెరిగిపోతున్నాయి।

ఇలాంటి స్థితిలో—ఇటు పెళ్ళిలేక, అటు బ్రతుకుతెరువు లేని నాలాంటి ఆడపిల్ల గతేమిటి?

ఈ ఆలోచన నాకీమధ్యనే వస్తోంది

"ఏమిటే ఆలోచిస్తున్నావు?" అంది అమ్మ నా వంక చూస్తూ.

* * *

రాత్రి తొమ్మిది గంటలవుతోంది.

—తమ్ముడింకా రాలేదు. వస్తాడని నమ్మకం కూడా లేదు. వాడు యిల్లు విడిచి వెళ్ళి నాల్గు రోజులయింది. వెళ్ళేముందు వాడు నాన్నగారితో గట్టిగా ఘర్షణపడ్డాడు.

నాన్నగారు పనికిమాలిన చదువు చెప్పించేరట. చిన్న వుద్యోగం వేయించలేని అసమర్థులట। ఇంటర్వ్యూకి వెళ్ళాలన్నా గీసి గీసి ముష్టి వంద రూపాయలు సర్దలేరట। ఇంకా యిలా ఎన్నెన్నో।

వాడి మాటలకు నాన్నగారు కృంగిపోయేరు.

అమ్మ పరేసరి। లోపల గదిలో కుమిలికుమిలి ఏడుస్తోంది.

వాడు వెళ్ళేక అమ్మ మీద నాన్నగారి మీద విసుక్కుపడింది "ముందు పార్వతి పెళ్ళి సంగతి తేల్చండి। నా ప్రాణం ఉండగా దాన్ని, ఎవరికి ముష్టివాడికిచ్చి చేసినా నాకు సంతోషమే। వాడు మగవాడు। రిక్షా లాక్కునైనా బ్రతుకుతాడు। దీని గతేమిటి? పాతికేళ్ళు వచ్చేయి, రేపు మనం పోతే దాన్నెవరు చూస్తారు!" అంటూ ఏడ్చింది.

నాన్న ఎప్పటిలాగే మౌనాన్ని ఆశ్రయించేరు.

హాల్లో పరమేశం బాబాయి నాన్నతో మాట్లాడుతున్నారు.

"ఏం, మీ నారాయణింకా యిల్లు చేరలేదా?" అన్నారు బాబాయి.

"లేదు. వాడు నా మీద అలిగేడు. అసమర్థుడయిన తండ్రిని చూస్తే సంతానానికి లోకువే కదా!"

"ఏమిటట?" బాబాయి ప్రశ్న.

"ఏముంది? మధ్య తరగతి కుటుంబాల్లో వుండే మామూలు చరిత్రే। నిరుద్యోగం। ఆర్థిక యిబ్బందులు!" అన్నారు నాన్న దిగులుగా.

"ఎంతయినా నువ్వు పొరబాటు చేసేవోయ్। ముందు వున్న దాంతో ఆడపిల్లని వదిలించేసుకుంటే, ఆ పైన వున్నదానితో ఎదో ఒకటి ఏడ్చేవాడు। మొదటినుండి నువ్వు పార్వతిని పక్షపాతంతో చూసేవ్। ఎంతసేపూ కొడుకుని అందలం ఎక్కించాలనే

శాపగ్రతయమే!" బాబాయి నాన్నని అలా కోప్పడటం ఎన్నోసార్లో!

నాన్న నిష్ప్రహగా నవ్వి "ఆఖరికి నువ్వూ మా రాజ్యంలాగే అంటున్నావు. పార్వతంటే నాకు ప్రేమ లేదనేగా మీ అందరి ఉద్దేశ్యం! వాడికి వుద్యోగ మొస్తే గట్టిగా నాలుగేళ్ళలో వాడి జీతం దాచి పార్వతికి మంచి సంబంధం చెయ్యాలనుకొన్నాను. ఆ విధంగా యిద్దరూ ఒక స్థాయి పైకెళ్ళి సుఖ పడ్తారని కలలు కన్నాను. కాని యీ రకంగా వాడు నిరుద్యోగయి—దానికి మేమంతా కారణంగా వూహించుకొని పగబడ్తాడని ఏనాడూ అనుకోలేదు."

పరమేశం బాబాయి మరింత మాట్లాడలేదు

"ఇంకో సంవత్సరం సర్వీసు వుంది. ఈ లోపునయినా వాడికో వుద్యోగం వస్తే నాకో సమస్య తీరుతుంది."

లోపలి నుండి అంతా వింటూన్న నేను గాఢంగా నిట్టూర్చేను. ఆలో చించగా, ఆలోచించగా నా మెదడులో భవిష్యత్తొక అంధకార బంధురమై కన్పించసాగింది.

తెల్లవార్లూ నిద్ర లేకుండా అస్థిమి తంగా గడిపేను. రెండేళ్ళగా అమ్మ నాకు పాతికేళ్ళే అంటున్నా నా వయ సెంతో నాకు తెలుసు పరమేశం బాబాయి గారి రెండో అమ్మాయి శాంతకన్నా నేను ఆరునెలలు చిన్నట ఆ అమ్మాయికి ముగ్గురు పిల్లలు. పెద్దవాడు సెవెంత్ చదువుతున్నాడు. చదువులో పెద్దగా తెలివితేటలు లేని తమ్ముడు- క్లాసు రెండుసార్లు చదువుతూ 'డొనేషన్ పుణ్యమా' అని ఇంజనీరింగ్ డిగ్రీ సంపాదించేడు. వాడి వయసే పాతిక దాటింది.

అమ్మ గుండెనొప్పి మనిషి. నాన్న రిటైరయ్యే దశకి వచ్చేరు. తమ్ముడు ఇంజనీర్‌గా తప్ప మరో వుద్యోగం చేసే స్థితిలో లేడు. ఒకవేళ చేసినా నా గురించి వాడికంత సానుభూతి లేదు. ఇప్పట్లో నాకు పెళ్ళి చేయగలస్థితి వీళ్ళ కెంతమాత్రం లేదని తెలిసిపోతూనే వుంది ఒకవేళ చేద్దామన్నా పెద్దగా చదువుసంధ్యలు లేని వయసుమీరిన నన్ను కట్టుకునే వుదార పురుషుడు దొరుకుతాడని నమ్మకం కూడ లేదు.

మరి నేనే విధంగా బ్రతకాలి?

ఆ ప్రశ్న ఆ క్షణంలోనే వుద్భవించి వటుడింతై, అంతై.... అన్నట్లు నా మనసంతా ఆక్రమించి నన్ను అమితంగా భయపెట్టసాగింది.

నేను వులిక్కిపడి లేచి కూర్చు న్నాను.

ఇదేమిటి??

ఎన్నడూ లేంది నా బ్రతుకు నాకింత సమస్యేందేమిటి?

ఈ ఆలోచన ముందే వచ్చివుంటే ఏదైనా చేయగల్గేదాన్నేమో!

తెలతెలవారుతోంది.

చీకటిలో సమస్యలు మనిషిని అమితంగా భయపెడ్తాయి.

మనిషి యెంత విపత్తులో యిరుక్కున్నా -వాటినుంచి తాత్కాలికంగా వూరడించి ధైర్యాన్ని కల్గించే శక్తి వెలుగుకి వుంది.

అదే ధైర్యంతో చీపురు తీసుకుని వీధివాకిలి వూడ్చేందుకు వెళ్ళేను. ఆలోచనలు నా అంతరంగాన్ని బాధిస్తుండగానే నీళ్ళు జల్లి ముగ్గుపెట్టేను. నాకు వచ్చింది ఒకేఒక విద్య. అది కుట్టుమిషన్ కుట్టడం. అదీ కూడా శాంత పుణ్యమా అని పరమేశం బాబాయి గారింట్లో నేర్చుకున్నాను. దాన్నే బ్రతుకుతెరువు చేసుకుంటే ?

కాఫీనీళ్ళు స్టవ్ మీద పడేస్తుంటే వచ్చిందా ఆలోచన. ఒక్కసారి ఎలాగో ఒళ్ళు ఝల్లుమంది.

తప్పు చేస్తున్న భావన !

ఏది తప్పు ? ఎందుకు తప్పు ?

ప్రతివాళ్ళు ఏదో విధంగా కష్టపడి ఎవరిపొట్ట వాళ్ళు పోసుకొనే రోజులు ! చదివిన చదువు నుపయోగించుకొని వుద్యోగాలు చేసి సంపాదించటంలేదూ ! మంచి గొంతున్నవాళ్ళు పాటలు పాడి డబ్బు సంపాదించటంలేదూ ;

రచయితలు కాగితాలు నింపి సంపాదించటంలేదూ !

అలాగే నా కొచ్చిన ఒకే ఒక విద్య నుపయోగించి పొట్ట పోసుకోవటంలో ఎలాంటి తప్పుంది ?

తల్లిదండ్రులు వుండగానే నా బ్రతుకు గురించి నేనాలోచించుకోవాల్సి వచ్చింది.

నా కళ్ళు నీళ్ళతో నిండిపోయేయి.

ఆందోళనగానే అన్ని పనులు ముగించేను

"ఆఫీసు టైమవుతోంది. అన్నం పెట్టమ్మా" అన్నారు నాన్న.

గబాగబా వడ్డించేను.

ఆయన తింటుంటే దగ్గరగా నిలబడి నా మనసులోని మాట చెప్పాలని ప్రయత్నిస్తున్నాను.

ఏదో కంగారు ! భయం !

నాన్న చూస్తుండగానే అన్నంలో చెయ్యి కడిగేసుకొన్నారు నాకు చివుక్కుమనిపించింది.

"అదేంటి నాన్నా, అన్నం వదిలేసేవు!" అన్నాను ఆందోళనగా.

"ఏవిటో ఆకలిగా లేదమ్మా" అన్నారాయన పీటమీంచి లేస్తూ.

ఆయన ముఖం బాధతో కమిలిపోయి వుంది. తెల్లవార్లూ ఆయన కూడా నిద్రలేకుండా ఆలోచిస్తున్నారని అలసిపోయిన ఆయన ముఖమే చెబుతోంది.

నేను అడుగుదామనుకున్న మాట నా మనసు లోపలిపొరల్లోనే వుండిపోయింది. 'ఈ టైంలో నేను కూడ ఎందుకు ఆయన్ని బాధించటం' అని సమర్థించుకొన్నాను.

"అమ్మా పార్వతీ, టిఫిన్ బాక్స్



యిస్తావా?" అన్నారు నాన్న జోళ్ళు వేసుకుంటూ.

గబగబా టిఫిన్ బాక్సు పట్టుకొని గుమ్మం దగ్గరికి నడిచేను.

బాక్సు అందుకుంటూ ఆయన నా ముఖంలోకి దీక్షగా చూసేరు. ఆయన ఎందుకలా చూసేరో నాకు అర్థం కాలేదు.

'పోనీ! యిప్పుడు నా మనసులో మాట చెప్పేస్తేనో.... అనిపించింది.

సందేహంగా ఆయన ముఖంలోకి చూసేను

"ఏం తల్లీ! ఏమైనా చెప్పాల్సి వుందా?" అన్నారు నాన్న లాలనగా. ఆయన మాటలు నాకు కొంతంత ధైర్యం యిచ్చేసింది.

"నాన్నా!" అంటూ ఆగేను.

"చెప్పు తల్లీ! అవతల నా ఆఫీసు టైం అయిపోతోంది" అన్నారు.

"నాన్నా నాకొక కుట్టుమిషన్ కొని పెడతావా" అన్నాను గబగబా.

ఆయన ఆశ్చర్యంగా చూసేరు నావైపు. ఆ వెంటనే ఆయన ముఖంలో రకరకాల రంగులు తేలి చివరకు తెల్లబడిపోయేయి.

నేను భయపడిపోయేను.

'నేనేమైనా తప్పుగా అన్లాడేనా?' అర్థంకాక నేలచూపులు చూస్తూ నిలబడి పోయేను.

"ఏమ్మా! నీకు యిండి నా మీద అపనమ్మకం కలిగినట్లుంది. నీ కెలాగూ పెళ్ళి చేయలేకపోయేను. బ్రతుకు తెరువు కూడ చూపించలేకపోయేనని భయపడుతున్నావా?" ఆయన మాటలు భారంగా వచ్చినా బాణాల్లా నా గుండెను తాకేయి.

"అదికాదు నాన్నా" అన్నాను ఎలాగో నోరు పెగుల్చుకొని.

"భయంలేదమ్మా, ఇందులో నీ తప్పేం లేదు. పరిస్థితులలా వున్నాయి. కాని, మీ అందరికీ నేను అన్యాయం చెయ్యను తల్లీ! అన్నీ సవ్యంగా జరిపిస్తాను. నువ్వేం మిషన్ కుట్టి పొట్టపోసుకో నవసరం లేదు. నా మాట నమ్ము" అంటూ మెట్లు దిగేరు.

భారంగా అడుగులు వేస్తూ దూరమౌతోన్న ఆయన్ని అంతకంటే భారమైన మనసుతో చూస్తూ అలా ఎంతసేపు నిలబడ్డానో..?

* * *

తెల్లవారి రెండు గంటలయింది

అందరికన్నా ముందు లేచి కాలకృత్యాలు ముగించుకొనే నాన్న ఆ రోజు యింకా లేవకపోవటం ఆశ్చర్యం కల్గించింది నాకు.

తమ్ముడు నారాయణ గురించి ఆయన చాల బెంగపడ్డట్లున్నారు. నిజానికి వాడికాయన ఏ విధంగానూ అన్యాయం చెయ్యలేదు. శక్తికి మించిన చదువు చెప్పించేరు. ఉద్యోగం రాకపోవటం ఒక విధంగా మా అందరి దురదృష్టం. అందుకోసం అలిగి వాడు యిల్లు వదిలి వెళ్ళి పదిహేను రోజులు దాటుతోంది.

'పైగా నిన్న నా మాటలు కూడ ఆయన్ని బాధించేయేమో?'

"పార్వతీ! మీ నాన్న లేవలేదటే?" అంది అమ్మ.

"లేదమ్మా" అన్నాను.

"చూడు, జ్వరంగాని వచ్చిందేమో!" అంది

ఆవిడ మంచం దిగి నారం రోజు లవుతోంది.

ఎవరికి వాళ్ళు మనోవ్యాధి పెంచు కొని మంచాలెక్కేరు.

నే నొక్కర్తినె కాబోలు మొండి దాన్ని!

మెల్లిగా మంచం దగ్గరకెళ్ళి 'నాన్నా' అని పిలిచేను.

జవాబులేదు,

ఆయన పక్కకి వత్తిగిలి నిద్రపోతు న్నారు.

వంటిమీద చెయ్యి వేసేను.

జ్వరం లేదు.

"నాన్నా చాల ఎండెక్కింది లే" అంటూ కుదిపేను.

'ఆ వళ్లు చల్లగా.... అదోలా.... మంచుముక్కలా... ' నేను భయంతో బిగుసుకుపోయేను.

"ఏవే పార్వతీ! మీనాన్న లేవలేదూ!" అవతల హీనస్వరాన అమ్మ పిలుపు!

"అమ్మా.... నాన్న. . నాన్న.... మాట్లాడటంలేదే."

అమ్మ గుమ్మంలోకొచ్చి నిలువు గుడ్లేసుకొని చూస్తోంది.

నేను వెంటనే స్పృహవచ్చినదానిలా పరమేశం బాబాయి యింట్లోకి పరిగెత్తాను.

"బాబాయ్, నాన్న మాట్లాడటంలేదు" అన్నాను వణికిపోతూ.

"అంటే....?" బాబాయ్ అర్థంకానట్లు నొసలు చిట్లించేరు.

"ఏమో, నిద్రలేపితే లేవటంలేదు" అన్నాను ఏడుపు దిగమింగుకొంటూ.

"అయ్యో సావిత్రీ! నువ్వెళ్ళి రాజ్యంగారి దగ్గర నిలబడు. ఆవిడసలే గుండెజబ్బు మనిషి. నేను క్షణంలో డాక్టర్ని తీసికొస్తాను" అంటూ భార్యకి చెప్పి వున్నపళంగా రోడ్డు మీదకు నడిచేరు

నేను సావిత్రిపిన్ని వెంబడి యింట్లోకి వచ్చేసరికి అమ్మ స్పృహతప్పి నాన్న మంచంప్రక్కన పడివుంది.

నా కంతా అయోమయంగా వుంది. గుండె ఆగిపోయేలా వుంది. ఏడుపుకూడా రావటంలేదు. సావిత్రిపిన్ని సాయంతో అమ్మని మంచంమీదకి సాయంపట్టి పడుకోబెట్టేను.

సావిత్రిపిన్ని నాన్న వంటిమీద చెయ్యి వేసి చూసి నా వంక అదోలా చూసింది.

"పిన్నీ!" అన్నాను భయంగా.

పిన్ని మాట్లాడకుండా నా చెయ్యి గట్టిగా నొక్కి పట్టుకొంది.

ఇంతలో బాబాయి డాక్టర్ని వెంటబెట్టు కొచ్చేరు.

డాక్టరుగారు నాన్న నాడిపట్టుకొని చూసేరు. ఏవో పరీక్షలుచేసి బాబాయివేపు తిరిగి "సారీ, ఆయన ప్రాణంపోయి అప్పుడే నాలుగ్గంటలు దాటింది." అనే సేరు.

గుండెలో ఇంతసేపూ గూడుకట్టుకుని వున్న భయం, అనుమానం దుఃఖ

రూపంలో బయటికి తన్నుకొచ్చేసేయి.

"బాబాయ్" అంటూ ఆయన్ని చుట్టబెట్టుకుపోయేను. బాబాయ్ నా వీపు నిమురుతూ "ధైర్యం తెచ్చుకోవాలి" అన్నారు.

నాన్నని చూడటానికి వచ్చిన డాక్టరుగారు అమ్మకి నిద్రపట్టేందుకు ఇంజక్షన్ యిచ్చి వెళ్ళిపోయేరు.

"ముందు జరగాల్సిన తతంగం చూడాలి—నారాయణ ఎక్కడున్నాడో వెతకాలి" అంటూ నన్ను పిన్నికి అప్పగించి బయటకివెళ్ళేరు. "ఎప్పుడూ గుండె నొప్పితో బాధపడే రాజ్యాన్ని గురించే భయపడేవాళ్ళం కాని, ఈయనింత అర్ధాంతరంగావెళ్ళిపోతారని కలలో కూడా అనుకోలేదు." సావిత్రిపిన్ని చూడవచ్చిన వాళ్ళతో చెబుతోంది.

"పాపం, పిల్ల పెళ్ళికూడాచేయలేదు"

"కొడుక్కి వుద్యోగంకూడా లేదట"

"రాజ్యంగార్ని జాగ్రత్త!"

ఎవరెవరివో గొంతులు!

ఏవేవో సానుభూతులు!

అలా ఎంతసేపు గడిచిందో!

బాబాయి నారాయణని వెంటబెట్టుకొచ్చేరు.

జరగవలసిన తతంగం జరిగిపోతోంది.

నేనలా ప్రమాన్పడి ఎంతసేపు కూర్చున్నానో! ఎన్నిరోజులు కూర్చున్నానో!

• • •

నారాయణ ఈ పదిహేను రోజులుగా యింటిపట్టునే వుంటున్నాడు. అమ్మతీవచ్చేవంలా మంచాన్ని అంటుకొని వుంది.

మా మధ్య ఎలాంటి మాటలూ లేవు!

ఎవరి ఆలోచనలు వారివి!

ఎవరి బాధలు వారివి!

ఎప్పుడయినా కాస్సేపు పరమేశం బాబాయి కాని, సావిత్రిపిన్ని కాని వచ్చినప్పుడే కాస్త కదలిక!

ఆ రోజు పరమేశంబాబాయి హడావుడిగా లోనికొస్తూనే అమ్మని పిలవమన్నారు.

నేను మెల్లిగా అమ్మని లేవదీసి నడిపించుకొచ్చి హాల్లో మంచమ్మీద కూర్చోబెట్టేను.

పరమేశం బాబాయి కుర్చీలో కూర్చున్నారు.

దూరంగా కిటికీ దగ్గరగా నారాయణ నిలబడ్డాడు.

"చూడమ్మా! పోయినవాళ్ళ గురించి ఎన్నాళ్ళిలా బల్లల్లా మంచాల కతుక్కుని తెంగపడ్తారు? ధైర్యంతెచ్చుకొని తిరగాలి!" అన్నారు అమ్మ నుద్దేశించి.

అమ్మ కళ్ళనీళ్ళు కతుక్కొంటూ తలవాల్చుకొంది.

"చూడు నారాయణా!" అంటూ బాబాయి నారాయణని దగ్గరకి పిలిచేరు.

నారాయణ దగ్గరగావెళ్ళి నిలబడ్డాడు.

"పోయిన మీనాన్న ఎటూ తిరిగిరారు! అంతకంటే మీరు బాధపడవలసింది—

ఉన్న ఆధారం పోవటం! అది పెద్ద దుర దృష్టం! కాని మీకొక విధంగా అదృష్ట వంతులే! మీ నాన్న సర్వీసులో వుంటూ పోవటంవల్ల— నీకు అదే ఆఫీసులో ఉద్యోగం వస్తుంది ఏదో ఒక వుద్యోగం కాదు. నిన్ను వెంటనే ఇంజనీరుగా తీసు కొంటారు. మీ అమ్మ గారికి పెన్షన్ వస్తుంది. పైగా ఈ గవర్నమెంటు క్వార్టరు కూడ మీరు ఖాళీచేయనవసరం లేదు." అంటూ ఆగి ఆయన ఒక క్షణం నా ముఖంలోకి చూసేరు.

"పోతే ఇక పార్వతి విషయం! ఫేమిలీ బెనిఫిట్ ఫండుగా గవర్నమెంటు నుండి పది వేల రూపాయలొస్తాయి. వాటితో పార్వతి పెళ్ళి జరిపిస్తే సమస్య లన్నీ తీరినట్లే!" అంటూ లేచేరు.

నాకు ఆశ్చర్యం, బాధ కలిగింది.

ఏవయితే తన చేతులమీదుగా చెయ్య లేకపోయేరో, అవన్నీ ఆయన పోయేక —కేవలం ఆయన మూలంగా మాకు అందుతున్నందుకు బాధపడాలో, సంతో షించాలో అర్థంకాని స్థితి.

• • •

నారాయణ రూపం మారిపోయింది.

ఈ మధ్యనే కుట్టించిన రకరకాల ఖరీదైన బట్టలతో వాడు తీవిగా నిజమైన ఇంజనీరులాగే మెరిసిపోతున్నాడు.

చాల త్వరగానే నాన్న పోయిన బాధ మరచిపోయినట్లున్నాడు.

'అసలు వాడు బాధపడ్డాడా ?" అని నా అనుమానం.

ఇంజనీరుగా వుద్యోగం సంపా దించేకే వాడి ముఖంలో చెప్పలేని వుత్సాహం కనిపించింది.

అమ్మ వుండలేక ఒకరోజు అడి గింది "నాన్న పేరుతో డబ్బేదో వస్తుందని చెప్పారా బాబాయి! ఏమైందా ?"

నారాయణ ఆ మాటకే పెద్దపెట్టున వినుక్కున్నాడు. "ఆఫీసులో మేటర్ సెటిల్ చేయటం అంటే యింట్లో కూర్చుని వంకాయలు తరగటం కాదు! టైం పడుతుంది" అంటూ.

అమ్మ మరింకేం మాట్లాడలేదు.

ఇదిలా వుండగానే నారాయణ ఒక రోజు కూడా ఒక అమ్మాయిని వెంట బెట్టుకొచ్చేడు.

ఆ రావటం మామూలుగా కాదు. మెడలో పూలదండలతో!

విషయం అర్థమైపోతూన్నా ఏదో అర్థం కాని బాధ!

"ఏమిట్రా యిది ?" అంది అమ్మ ఆందోళనగా.

ఆ అమ్మాయిని చదువుకునే రోజు ల్లోనే ప్రేమించేడట. వుద్యోగం కోసం ఆగేడట యిన్నాళ్ళూ! తండ్రి పోయిన మూడు నెలలకే పందిట్లో పెద్దపెట్టున పెళ్ళిచేసుకోవటం బాగుండ దని సింపుల్‌గా స్నేహితుల సమక్షంలో

రిజిస్టర్ మేరేజ్ చేసుకొచ్చేనని తేలిగ్గా చెప్పేసేడు.

ఆ మాట విని అమ్మ కుమిలి కుమిలి ఏడ్చింది.

నారాయణ యింతెత్తున ఎగిరేడు. "శుభమా అని పెళ్ళిచేసుకుంటే శవం వెళ్ళినట్లా ఏడుపేమిటి? ఇంట్లో వుండ మంటావా, వద్దా?" అన్నాడు

అమ్మని గట్టిగా పట్టుకొని ఏడ్వొద్దని బ్రతిమాలేను.

"ఏడ్వటం కాక నాకేం మిగిలింది? డాక్టర్లు నా గుండె బలహీనమంటారు! ఇన్ని జరిగినా యిది ఆగిపోవదేమే!" అంటూ వాపోయింది,

నారాయణ అతని భార్య శ్యామల ఆ రాత్రే వూరెళ్లేరు.

"అక్కా, మేం అలా నాలుగువూళ్లు తిరిగొస్తాము. పెళ్ళి చేసుకొచ్చేమని యిక్కడ ఎవరికన్నా పరదానా. సంతో షమా." అన్నాడు సూట్‌కేసు తీసుకొని బయల్దేరుతూ.

హనీమూన్ కాబోలు!

ఆ రాత్రి అమ్మ పరమేశం బాబాయికి చెప్పి ఏడ్చింది

"వాడెవర్ని చేసుకొని ఎలా వూరేగినా నాకు అక్కర్లేదు. వాళ్ళ నాన్న పేరున వచ్చిన డబ్బుతెస్తానని నాచేత సంతకాలు పెట్టించుకొని వెళ్లేరు. అది కాస్త యివ్వ మనండి. దాని పెళ్ళి జరిపించి కళ్ళు మూసుకుంటాను," అంది.

పరమేశం బాబాయి సరేనంటూ లేచి వెళ్ళిపోయేరు.

• • •

నారాయణ వూరినుంచివచ్చి సరాసరి వేరే కాపురం పెట్టేడని తెలిసి హతాశు లయ్యేం.

అప్పటికి ప్రాణం ఆగక అమ్మ పర మేశం బాబాయిని పంపించి డబ్బు విష యం అడిగి రమ్మంది.

బాబాయి వెళ్ళిన గంటలోనే వుసూరు మంటూ తిరిగొచ్చేడు.

"లాభం లేదమ్మా. అనకూడదుగానీ అలాంటి విశ్వాసఘాతకుణ్ణి కొడుకని మరచిపో. వచ్చిన డబ్బు వాళ్ళనాన్న చేసిన అప్పులకి వడ్డీ కట్టడానికే చాల లేదట. పార్వతి పెళ్ళి తన బాధ్యత ఎలా అవుతుందని, నిలవేసేడు. ఒకటేమిటి, అన్నీ అడ్డంగానే మాట్లాడేడు నెలకి ఓ వంద రూపాయలిస్తాడట. ఈ క్వార్టర్లో వుండమని ఔదార్యం ప్రకటించేడు." అన్నారు.

అమ్మ నిటువునా నీరయిపోయి కూర్చొంది.


నాకు అకస్మాత్తుగా ఎక్కడలేని ధైర్యం, తెగింపూ వచ్చేసేయి.

"అమ్మా నామాట ఒకటి వింటావా?"

అమ్మ నావేపు దీనంగా చూసింది.

"ఈ రోజునుంచి నువ్వు నేనొక్క తినే కూతుర్ని అనుకో. ఏ ఆధారం కోసమో, ఎవరి జాలికోసమో ప్రాకు

వీళ్ళు–నీళ్ళు



లాదతు. కనీసం నువ్వు ప్రాణంతో నాకు అండగా వుంటే అది చాలు నాకు" అంటూ బాబాయివేపు తిరిగి అన్నాను. "బాబాయ్, ఇంటిపక్కనవున్న నేస్తానికో, నాన్నకి నిజమైన స్నేహితుడిగానో సొంత బాబాయివి కాకాపోయినా కన్న తండ్రికంటే ఎక్కువే మమ్మల్ని ఆదుకొన్నావు. ఆదే ధైర్యంతో యింకొక్క సాయం చేయమని కోరుతున్నాను. కాదనవుగా."

"ఏమిటమ్మా అది?"

"నాకొక్క కుట్టుమిషన్ కొనివ్వు. దానితో నా పొట్ట నేను పోసుకోవటానికి ప్రయత్నిస్తాను. ధర్మంగా మాత్రం అడగను, కేవలం అప్పుగా మాత్రమే. మెల్లిగా నీ ఋణం తీర్చుకుంటాను."

బాబాయి సరేనంటూ నా తల నిమిరి 'అలాగేనమ్మా' అంటూ పైకిలేచేరు.

"అంతేకాదు బాబాయ్. ఈ క్వార్టర్ మాకొద్దు. ఏదైనా ఒక గది చూడు. మా కర్మకి తగ్గయింట్లోనే వుంటాం" అన్నాను.

వారం రోజుల తర్వాత—

బాబాయి కాస్త దూరంగా ఒక గది చూసిపెట్టేడు

సామాన్లు సర్దుతున్నాను.

నాన్నకి సంబంధించిన పాతకాగితాలేవోతీస్తుంటే చింపబుద్ధి కాలేదు.

ఒకొక్కొక్కటే చూస్తుండగా—

అకస్మాత్తుగా నాన్న దస్తూరి వున్న కాగితంమీద నా దృష్టి పడింది.

అది నాన్న చనిపోయేముందు నారాయణకి వుద్దేశించి రాసిన వుత్తరం!

నా చేతులు వణుకుతోన్నా నా కళ్ళు ఆదుర్దాగా చదువుతోన్నాయి.

నాయినా నారాయణా!

ఈ ఉత్తరాన్ని నువ్వు సాధ్యమైనంత సావధానంగా చదువు.

నాలా నువ్వు గుమస్తావు కాకూడదని—ఇంటి బాధ్యతల్లో యిరుక్కుని చిన్న వయసులోనే నశించిపోకూడదనే సదుద్దేశంతోనే నేను నిన్ను శక్తికి మించినా, అప్పులు చేసి డొనేషన్ కట్టి ఇంజనీరింగ్ చదివించేను. నా చేతుల మీదుగా ఎప్పాయింటుమెంటు తీసుకొన్న కుర్ర యింజనీర్లెంతమందో— నా కళ్ళ ముందే పెద్ద పెద్ద ఆఫీసర్లు కావటం చూసి నాకు ఎలాగయినా నిన్ను ఇంజనీర్నే చేయాలన్న దురాశ కల్గింది. దురాశ అని ఎందుకంటున్నానంటే నా ఆశ అడియాశ అయ్యింది కాబట్టి. ఆ ఆశతోనే నేను నా బాధ్యతలు కొన్ని విస్మరించేను. అందులో ముఖ్యమైంది పార్వతి పెళ్ళి. అయితే యిది కేవలం నిర్లక్ష్యం మాత్రం కాదు. నీవు యింజనీరు కాగానే నాలుగేళ్ళలో డబ్బు కూడగట్టుకొని పార్వతికి మంచి సంబంధం చూడాలనే ఆశ వుంది.

అయితే దురదృష్టంకొద్దీ నీ చదువయ్యే నాటికి ఇంజనీర్లకు నిరుద్యోగ సమస్య వచ్చింది. వున్నవాళ్ళనే పెద్దపెట్టున వూడబీకేసేరు. ఇది నాకు వెన్నుపోటయింది. నువ్వు కూడ ఈ సమస్యని అర్థంచేసుకోలేక నా మీదే విరుచుకుపడ్డావు. దానికితోడు పార్వతి... ఎన్నడూ నోరు విప్పి ఏదీ అడగని పార్వతి నాల్గు రోజుల క్రితం ఏం చేసిందో తెలుసా? ఓ కుట్టు మిషను కొనిపెట్టమని దీనంగా అడిగింది. అంటే దానికింక నేనేం చేయలేనని అది అర్థం చేసుకొందన్నమాట! ఇలాంటి పరిస్థితిలో కన్న తండ్రిగా నేనేం చేయాలి?

బాగా ఆలోచించేను. నేను ముందుగా రిటైరయితే నీకు అదే ఆఫీసులో వుద్యోగం వస్తుంది. కానీ... అది నీ చదువుకి తగినదే అయివుండాలని రూలు లేదు. కాని... వుద్యోగంలో వున్న వ్యక్తి పోతే వెంటనే అతని సంతానంలో ఒకరికి చదువుకి తగిన వుద్యోగం లభిస్తుంది. పైగా ఫేమిలీ బెనిఫిట్ ఫండ్‌గా ఓ పదివేలు అందుతాయి.

అందుకే.... అందుకే నా బాధ్యత తీర్చుకోవడానికి గాను నేను జీవితం నుండి రిటైరవుతున్నాను. ఇంతటితో మీ బాధలు తీరుతాయి.

కాని.... చివరగా నాదొక్క కోరిక.

పార్వతికి కావాలని కాకపోయినా నేను చాల అన్యాయం చేసేను. దానికి నువ్వు మాత్రం అన్యాయం చెయ్యకు.

నా పేరున వచ్చిన పదివేలతో దానికి తగిన పెళ్ళి చెయ్యి. వాడి ఆత్మ హత్యంటే లేనిపోని గొడవ కాబట్టి ఈ వుత్తరం చాల జాగ్రత్తగా ఫైల్స్ లోపల పెడుతున్నాను. ఇది నీవు తప్పక చూస్తావని నమ్మకం. నిద్రపట్టక తెచ్చుకొన్న నిద్రమాత్రలు మన అందరి సమస్యలకి దారి చూపిస్తాయని అనుకోలేదు.

ఇట్లు
మీ నాన్న.

ఆ వుత్తరం ముగించేటప్పటికి నా కళ్ళు అదేపనిగా వర్షించసాగేయి. గబ గబా దాని తీసికెళ్ళి బాబాయికి చూపించేను.

బాబాయి నిర్వ్యెరపోయేడు.

"ఎంత పని చేసేడు?" అన్నాడు బాధగా.

"ఉండమ్మా ఈ ఉత్తరం నారాయణకి చూపించి వాడి కళ్ళు తెరిపిస్తాను" అన్నాడు జోళ్ళుతొడుక్కుంటూ.

"వద్దు బాబాయ్" అన్నాను ఆవేశంగా.

ఆ వెంటనే బాబాయి చేతిలోని వుత్తరం లాక్కొని ముక్కలు ముక్కలుగా చింపేసేను.

బాబాయి ఆశ్చర్యంగా "అదేం పని పార్వతీ!" అన్నారు.

"ఆ వుత్తరానికి అంతే సమాధానం బాబాయ్! అంతే! కన్న తండ్రి ప్రేమలోనే తేడాలున్నప్పుడు ఎక్కడో తమ్ముడికి ఎలా నామీద అభిమానం వుంటుందో చెప్పు! తనకు తానుగా నిర్వర్తించాల్సిన బాధ్యతల్ని - తమ్ముడి చేతిలో పెట్టి - అతని దయాధర్మాల్ని యాచించటం ఎంత తెలివితక్కువో నీకు తెలియదా బాబాయ్! నారాయణ నా కన్నా రెండేళ్ళు చిన్నవాడు వాడి కన్నా ముందు పుట్టిన నేను - నా కన్నా చిన్నవాడి చేతిలో ముష్టి కోసం చేతులు చాచటం-ఎలాంటి ధర్మం బాబాయ్! ఇందులో తమ్ముడి తప్పు లేదు. నాన్న వాడి చేతికి పప్పు యిచ్చేరు. వాడిప్పుడు గొప్పవాడు! జేబులో పర్సున్నంత మాత్రాన కనిపించిన ప్రతి ముష్టివాడికి దానంచేయాలని రూలేం లేదుగా! కాబట్టి తమ్ముడు నా కేదో చేయలేదనుకోవడం తెలివితక్కువ. అందుకే.... ఆ ముష్టి నా కొద్దు! ఈ విషయం యిలాగే మరచిపోదాం" అన్నాను ఆవేశంగా.

బాబాయ్ యింకేం మాట్లాడలేదు. సావిత్రిపిన్ని నా తల నిమురుతూ వుండిపోయింది.